**“దండకారణ్యం అంటే ఏమిటో అనుకున్నాను. ఇంత విశాలమైన స్థలంలో చీమలు దూరని చిట్టడవులూ, కాకులు దూరని కారడవులూ పెరిగివుంటాయనుకోలేదు” అన్నాడు గిరి.**

# కౌలి

ఎమ్.వి.వి.సత్యనారాయణ

కుమార్ తలూపి, “ఆరునెలల క్రితం నేనూ నీకు లాగానే ఈ చెట్లూ, తీగలూ, పొదలూ, మనం ఏనాడూ చూచి ఎరుగని పక్షులూ, ఎర్రటి కుందేళ్ళూ, విషసర్పాలూ చూచి నిశ్చేష్టుడిలాగా వుండిపోయాను. ఈ అడవిలో దారి తప్పామంటే యిక అంతే సంగతి.” అన్నాడు.

గిరి జీపును బయలు దేరతీశాడు. జీపు సన్నటి గతుకుల దారిలో ప్రయాణిస్తోంది. దారికి రెండు ప్రక్కలా పెరిగిన లతలూ చెట్ల కొమ్మలూ జీపును రాచుకుంటున్నాయి. ఎండి పోయిన కుళ్ళిన ఆకుల మీద నుండి దోమలు కుప్పతిప్పలుగా పైకి లేస్తున్నాయి. జీపు రొదతో పాటు దోమలు ఝుం మంటూ శబ్దం చేస్తోన్నాయి.

ఎండ ఎక్కువగా వుంది. గాలి నిలబడి పోయినట్టుయి వుక్క పెడుతోంది.

గిరి దుస్తులు విప్పుకోవడానికి జీపు ఆపాడు. కుమార్ మ్యాప్‌ను ఒడిలో పరచుకున్నాడు. అడవిలో నివాసయోగ్యమైన ప్రాంతాలున్నాయి. కొన్నిలక్షల ఎకరాల మేర పరచుకుని వున్న అరణ్యాలలో కొండలున్నాయి. జలపాతాలున్నాయి. నీటి వసరులున్న ప్రాంతాలలో సవరలూ, కోయలూ, యితరకొండ జాతులు నివసిస్తోన్నాయి.

గిరి దుస్తులు విప్పి ఆహారపు పొట్లాలు యివతలికి తీశాడు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తిండిముగించి ఫ్లాస్కులోంచి టీ త్రాగారు.

“ఆటవిక ప్రజలను పరిశీలించాలంటే మనం యింకా ముందుకు వెళ్ళవలసివుంది.” అన్నాడు కుమార్.

గిరి మ్యాప్‌ని పరిశీలించి, “మనకు తూర్పున జలపాతం వుంది. దాన్ని దాటితే సవరల నివాస ప్రాంతం వుంది. అటు వెళ్దామా?” అన్నాడు.

“జలపాతాన్ని ఎలా దాటుతాం?”

“మీ అన్నయ్య జలపాతాన్ని దాటాడు. బృందంలో మిగతావాళ్ళు ఆ విషయం నిర్ధారించారు కదా!”

కుమార్ పెదిమలు వొణికాయి. అన్నయ్య! అన్నయ్య ప్రకృతి పరిశోధకుడు. ఈ అరణ్యాల పరిశోధనకి బృందంతో కలిసి వచ్చాడు. అన్నయ్య దారి తప్పి పోయాడు. వారం అయింది. ఈ నాటి వరకూ తిరిగి రాలేదు.

పరిశోధక బృందాన్ని ఆటవిక జాతి ఒకటి వెంట తరిమింది. ఆ జాతి నర బక్షక జాతి అయివుండవచ్చుననీ తప్పి పోయిన ప్రభాకర్‌ని పొట్టన పెట్టుకుని మిగతావాళ్ళ కోసం నర భక్షకులు వెంటపడి వుంటారనీ బృందం నాయకుడు అభిప్రాయ పడ్డాడు.

కుమార్ గుప్పెళ్ళు బిగుసుకున్నాయి. నిజంగా నరభక్షకులు యీ ప్రాంతాల్లో యింకా వున్నారా? తన అన్నయ్య వాళ్ళకు బలయిపోయి వుంటాడా? అన్నయ్య గురించి తాను ఖచ్చితమైన ఆచూకీ తీసుకురాగలడా?

గిరి అతడి భుజం తట్టాడు. “మన ప్రయత్నం అంతా సవ్యంగానే ఫలితం యిస్తుందని నాకు నమ్మకంగా వుంది. నువు ఆలోచించి బుర్ర పాడు చేసుకోవద్దు.” అన్నాడు.


కుమార్ అతడి చేతిని తడిమాడు. బాధ పడుతోన్న తన మనసు గిరికే బాగా తెలుసు. అందుకే అతడు కూడా తన వెంట ప్రాణాలకు తెగించి అడవికి బయలుదేరాడు.

జీపును బయలుదేర తీశాడు గిరి. సూర్యుడు తన ప్రతాపంతో అడవిని వుడికిస్తోన్నాడు. గంటన్నర ప్రయాణం తర్వాత గిరి అన్నాడు.

“అదిగో హోరు. నీరు దూకుతోన్న హోరు. జలపాతాన్ని సమీపిస్తున్నాం” అన్నాడు గిరి.

కుమార్ బైనాక్యులర్స్ తీశాడు. దూరంగా చూశాడు. అడవుల మధ్యలో తూర్పు కనుమలూ, ఒక కనుమకు తలమీద మరగలాగా జలపాతం పొర్లుతూనూ కనిపించాయి.

జీపు గతుకులలోంచి తుళ్ళుతూ కనుమల వైపు ప్రయాణం సాగించింది.



# 2

"అదిగో, అక్కడ నీటి వేగం తక్కువగా వుంది. అక్కడి నుండి జలపాతాన్ని దాట వచ్చును" అన్నాడు కుమార్.

గిరి అటు నడిచాడు. ఇద్దరూ జలపాతంలోకి దిగారు. నీటి ప్రవాహ వేగానికి నిల్రదొక్కుకుంటూ యిద్దరూ అవతలి గట్టు చేరుకున్నారు. కొండ మీద గాలి వేగంగా వీస్తోంది. బండరాళ్ళ మీద నుండి అవతల పొదలలోకి గెంతారు.

ఇద్దరూ వీపులకు కట్టుకున్న కిట్స్ విప్పారు. అల్పాహారం సేవించారు. ఇద్దరూ కాఫీలు తాగుతోండగా దూరం నుండి డప్పుల మోత వినిపించింది.

కుమార్ చకచక చెట్టు ఎక్కాడు. బైనాక్యులర్స్ సాయంతో అడవి చుట్టూ చూశాడు. డప్పుల మోత వినిపిస్తోంది కాని మ్రోగిస్తోన్న వాళ్ళెవరూ కనిపించడం లేదు.

గిరి కూడా ఎత్తయిన బండరాయి ఎక్కి డప్పుల మోత వినిపిస్తున్న వైపు చూశాడు. కుమార్ అతడిని గమనిస్తూనే అవతలి కొమ్మకు వాలి పొదల అవతలికి దూకాడు.



సాయంకాలం అవుతోంది. అడవిలో పక్షులూ గూళ్ళకు తిరిగి వస్తోన్నాయి. చెట్లమధ్య ఏవో జంతువులు అటూ యిటూ దూకి చప్పుళ్ళు చేస్తోన్నాయి. కుమార్ బైనాక్యులర్స్‌తో చూసుకుంటూ మధ్య మధ్య ఆగి వెనక్కి చూసుకుంటూ నడవసాగాడు.

బహిరంగ ప్రదేశానికి వచ్చాడు. చీకటి పడుతోంది. అకస్మాత్తుగా కుమార్ నిలబడిపోయాడు. అతడికి రెండువందల గజాల్ల దూరంలో ఏవో శబ్దాలు వినిపిస్తోన్నాయి. పొదల చాటు నుండి కుమార్ అటు నడిచాడు. చెట్ల చాటున ఆగాడు.

చెట్లకు అవతలి ప్రక్క చెరువు వుంది. చెరువు ఒడ్డున దివిటీలు వెలిగించారు. నలుగురు ఆటవిక జాతి స్త్రీలు దివిటీలు పట్టుకుని వున్నారు. వాళ్ళ వస్త్రధారణ విచిత్రంగా వుంది. ఛాతీమీద గుడ్డ పట్టీ, మెడలో రకరకాల పూసలూ, చెవులకు బరువైన కుండలాలూ, నడుముకు పువ్వుల పరికిణీ.

వారిలో యిద్దరు పెద్ద వయసు స్త్రీలు. మిగతా వాళ్ళు పదిహేను పన్నెండేళ్ల వయసు వాళ్ళు. వాళ్ళు ఎవరు? వాళ్ళకు అక్కడ ఏం పని? పెద్ద వయసు స్త్రీలు పిల్లలతో మాట్లాడుతోన్నారు.

వాళ్ల మాటలు వినాలని కుమార్ చెవులోరగా పెట్టాడు. ఎక్కడో గాజుల గలగల అయింది. కుమార్ చప్పున వెనక్కి తిరగబోయాడు. అప్పటికే ఆలస్యమయిపోయింది.

కుమార్ తలమీద పిడుగులాంటి దెబ్బ పడింది. కుమార్ ముందుకు పడ్డాడు. చెయ్యి రాతిమీద పడింది. టప్‌మని ఎక్కడో ఏదో తెగిపడినట్టయింది. కుమార్‌కు అంతే తెలుసు, స్పృహ తప్పిపోయింది.

అతడి వెనుక నిలబడివున్న ఆమె కదిలింది. అతడిని భుజాల క్రింద చేతులు వేసి తన వైపు యీడ్చుకుంటూ వెళ్ళింది. చెరువు గట్టున వున్న స్త్రీలు ఆమెకు సహాయంగా వచ్చారు. కుమార్‌ను మోసుకుంటూ వెళ్ళిపోయారు.

"కుమార్! కుమార్!" చీకట్లో గావుకేకలు పెట్టుకుంటూ గిరి వచ్చాడు.

దివిటీల కాంతి అప్పటికి లేదు.

బహిరంగ ప్రదేశంలో రెండు సంచులు మోసుకుంటూ గిరి వెతుక్కుంటున్నాడు. చెరువు ప్రాంతానికి వచ్చాడు అడవిలో అవతలి వైపున దివిటీల కాంతి సాగిపోతోంది.

గిరి నిరాశగా ఆగాడు. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్టయింది. కాగడాల కాంతి వైపు చురుకుగా అడుగులు వేశాడు.

## 3

**కు**మార్ కళ్ళు తెరిచాడు. అతడి కళ్ళకు ఒక గుడిసెలో వున్నట్టు తోచింది. వెదురు చువ్వలు నేలలో గుచ్చి పైన గడ్డి కప్పు వేసిన గుడిసే అది. కుమార్ ఒత్తిగిల్లాడు. రెల్లుగడ్డితో వేసిన ప్రక్క కావడంతో శరీరానికి రెల్లు గడ్డి గుచ్చుకుంది.

కుమార్ చటుక్కున లేచాడు. తాను చెట్టు చాటున నిలబడ్డాడు. చప్పుడయి వెనక్కి తిరగబోయేటంతలో తలమీద బరువు పడింది. ఇప్పుడు తాను ఎక్కడ వున్నాడు?

గుమ్మంలో గాజులు గలగల లాడాయి. కుమార్ అటు చూశాడు. ఆమె లోపలికి వచ్చింది. గజ్జెలు ఘుళ్‌ఘుళ్‌మన్నాయి. ఆమె కట్టుకున్న పరికిణీ మోకాళ్ళు దిగింది. ముతక గుడ్డ పరికిణీ మీద చిన్న చిన్న అద్దాలు కుట్టి వున్నాయి. రవికె కూడా అచ్చగా అలాగే వుంది. వల్లెవాటు లేదు. మెడలో రకరకాల రంగుల పూసల దండలున్నాయి. నుదుట ఎర్రటి బొట్టు వుంది. చెవులకు బరువైన లోలకాలు వ్రేలాడుతోన్నాయి. ఎర్రటి ఒంటి ఛాయతో ఆమె కొట్ట వచ్చినట్టు కనిపిస్తోంది.

ఆమె ఉల్లాసంగా నవ్వుతూ, నిద్ర లేచారా బాబూ! అంది. కుమార్ ఆమెను చూచి నప్పుడెలా అయితే ఆశ్చర్య పోయాడో ఆమె భాష విని కూడా అలాగే ఆశ్చర్యపోయాడు. ఆమె ఆటవిక వేషంలో వుంది. భాషలో ఆటవికుల ఉచ్చారణ లేదు. పల్లె పడుచులాగా మాట్లాడుతోంది.

కుమార్ తలూపి, "నేను ఎక్కడ వున్నాను?" అన్నాడు.

"క్షేమంగానే వున్నారు కదా!"

"ఎలా వచ్చాను యిక్కడికి?"

"నేనే తెచ్చుకున్నాను."

ఆమె నిస్సిగ్గుతనానికి అతడు సిగ్గుపడినంత పనయింది.

"నువ్వా?" ఎందుకు తీసుకు వచ్చావు?"

"నాకు మీ నాగరికత అంటే మోజు."

"అయితే?"

"మీరంటే మొదటి చూపులోనే యిష్టం కలిగింది. మీకు కూడా యిష్టమయితే మనం కలసి కాపురం చేద్దాం."

కుమార్ తడబడిపోయాడు. ఆమె ఎవరు? ఎందుకలా మాట్లాడుతోంది. ఆమె తనను నిజంగా యిష్టపడిందా? అయితే తనను యిక్కడికి చేర్చడానికి స్పృహ తప్పించారా?

"నువ్వెవరో తెలియకుండా ఎలా యిష్టపడతాను?"

ఆమె ముసిముసి నవ్వులు నవ్వింది. "మొహం కడుక్కోవడానికీ స్నానానికీ నీళ్ళు పెట్టాను." అంది.


×× ×× ×× ××


కుమార్ సమస్యలోంచి గట్టెక్కినట్టు గదిలోంచి యివతలకు వచ్చాడు. గూడెం కనిపిస్తోంది. వరుసలుగా కట్టిన ఒకే రకం యిళ్ళు. ఆటవికులు బుట్టలు అల్లుకోవడంలోనూ, వేటసామాగ్రిని పదును పెట్టుకోవడంలోనూ మునిగిపోయి వున్నారు. కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళు కుమార్‌ను చూడగానే కబుర్లు ఆపేశారు.

కుమార్‌కు బెరుకుగావుంది. ఆటవికులు భయంకరంగా వున్నారు. వీళ్ళు నిజంగానే నరభక్షకులేమో! కాలకృత్యాలు ముగించుకున్నామనిపించుకుని కుమార్ లోపలకు పరుగెత్తాడు. ఆమె పక్కబట్టలు సర్దింది.

"రాత్రంతా ప్రక్క కఠినంగా వుందికదా, బట్టలు సర్దాను" అంది ఆమె.

కుమార్ బలవంతంగా నవ్వు తెప్పించుకున్నాడు. ఈమె కూడా నరభక్షకే. అయినా తనను యిష్టపడుతోంది.






ఆమె పళ్ళూ, కందమూలాలూ ఆకులలో అందించి దోనెలో పట్టు తేనె పోసింది. కుమార్‌కి ఆహారం కొత్తగా వుంది.

ఆమె పకపక నవ్వింది. నవ్వినపుడు ఆమె పళ్ళు కనిపించాయి. కుమార్ అప్పుడు గమనించాడు. ఆమెవి కోరపళ్ళు. కుమార్‌కి ఒళ్ళు జలదరించింది. నరభక్షకులకు కోరపళ్ళుంటాయని అతడు విని వున్నాడు. ఈమె నిస్సందేహంగా నరభక్షకే. ఆమె అతడి వూహలతో పనిలేనట్టు బయటికి నడవబోయింది. కుమార్ చప్పున ఆమె చెయ్యి పుచ్చుకున్నాడు. ఏం అడగాలో తోచలేదు. ఆమె వెక్కిలి అతడి వెక్కిలికి తగిలింది. ఆమె అతడిని కౌగలించుకున్నంత పని చేసింది.

అతడు సున్నితంగా తప్పించుకుని, "నీపేరు?" అన్నాడు.

"కాళి." అంది ఆమె అతడిని ముద్దు పెట్టుకుంటూ.

కుమార్ చిగురుటాకులాగా వణికాడు. కాళి బయటికి వెళ్ళి పోయింది. కుమార్ చాలసేపు గదిలోనే గడిపాడు. విసుగెత్తిపోయింది. తను ఆటవికులకు చిక్కాడు. ఇప్పుడు వగచి ప్రయోజనం ఏమిటి? తన అన్న జలపాతం దాటి చిక్కింది ఈ జాతి ప్రజలకేనా?

వారం రోజుల క్రితం నాటి సంగతి ఇప్పుడెలా తెలుస్తుంది?

కుమార్ తలవిదిలించాడు. గుండె ధైర్యం తెచ్చుకున్నాడు. బయటికి నడచి గూడెం మధ్యలోంచి కదిలాడు. ఆటవికులు అతడిని వింత మృగాన్ని చూచినట్టు చూడసాగారు.

కుమార్ గూడెం చివరకు వచ్చాడు. ఆటవికుల పిల్లలు ఆడుకుంటున్నారు. కొంతసేపటికి కుమార్ వాళ్ళ ఆటను బువ్వాలాటగా గుర్తు పట్టాడు. పిల్లల మధ్య మూకుడు వుంది. పొయ్యి మీద మూకుట్లో మాంసం వుడుకుతోంది. నీళ్ళలో మాంసం వుడుకుతోండగానే ఒక్కొక్కరు తీసుకుని వూదుకు తింటున్నారు.

కుమార్‌ను వాళ్ళు చూశారు. వాళ్ళ చూపులు తోడేలు చూపుల మాదిరిగా వున్నాయి. కుమార్ చురుకుగా అక్కడి నుండి కదిలాడు. వెల్లతోపు అవతల కాలువ ప్రవహిస్తోంది. కుమార్ కాలువ వొడ్డున చతికిల పడ్డాడు.

ప్రభాకర్ అన్నయ్య ఎక్కడ వున్నాడని వెతకాలి? అసలు ఈ ప్రాంతం ఎక్కడుంది? కుమార్ మాప్‌కోసం తడుముకున్నాడు. బట్టలలో మాప్ లేదు. గిరి దగ్గర వున్నదేమో? తన కిట్, బైనాక్యులర్స్ ఎక్కడ జారి పడ్డాయో గుర్తు లేదు. తన మనసు అస్థిమితంగా వుంది. ఆలోచనల్లో ఎంత సేపు గడిచిందో కుమార్ గుర్తించేటప్పటికి ఎక్కడో ఎండుపుల్ల విరిగింది. కుమార్ నుదురు చిట్లించాడు. ఇటు ప్రక్క ఎవరో వస్తున్నారు.

అప్పుడే కుమార్‌కి ఒక విషయం గుర్తు వచ్చింది. తనను ఆటవికులు ఒంటరిగా వదలరు. ఎవరో ఒకరు తనను వెంటాడతారు. చప్పుడు వినిపించినవైపే చూపులుంచి కూర్చున్నాడు.

పొదల వెనుక పాంటూ షర్టూ కనిపిస్తోన్నాయి. కుమార్ వాటిని గుర్తు పట్టాడు. అవి తన అన్నవే. కుమార్ ఒక్క వుదుటున లేవబోయాడు.

పొదల వెనుక నుండి ఆకారం బయటికి వచ్చింది. కుమార్ వులిక్కిపడ్డాడు. పాంటూ షర్టులో వున్నది అన్నయ్య కాదు. మగవాడూ కాదు. ఆడది! ఆమెను కొంతసేపటికి గానీ గుర్తు పట్టలేకపోయాడు. ఆమె కాళి.

కాళి కులాసాగా నడచుకుంటూ అతడిని సమీపించింది.

"ఏం, నన్ను గుర్తు పట్టలేక పోయావా?" అంది కాళి. ఆమె ధోరణి మారింది.

కుమార్ యింకా ఆమె మీద నుండి కళ్ళు త్రిప్పుకోలేకపోయాడు. ఈ బట్టలు ఆమెకు ఎలా వచ్చాయి? అన్నయ్య యిక్కడికి వచ్చాడు. అతడికి కాళితో బాగా పరిచయం వుంది. కాళిని ఆ విషయం అడిగి నిర్ధారించుకుంటేనో?

కుమార్ తటపటాయించి బలవంతంగా నిగ్రహించుకున్నాడు. "అబ్బే... నువు మగాళ్ళ బట్టలు కూడా కుట్టించుకున్నావా అని... ఆశ్చర్యంగా చూస్తున్నాను" అన్నాడు.

"ఈ బట్టలా? అడవిలో దొరికాయి."

కుమార్ గుండె తెగిపడినంత పనయింది. "అడవిలో దొరికాయా. ఎక్కడ? ఎలా?" అన్నాడు. దాదాపుగా అరిచినంత పనిచేశాడు.

కాళి తెల్లబోయింది. అంతలోనే సర్దుకుని, "చెరువు దగ్గరే. నువు నాకు దొరికిన చోటనే యీ బట్టలు దొరికాయి."

"అంటే ఎవరో విడిచి వెళ్ళి వుంటారంటావా?"

"బట్టలు వొడ్డున పెట్టి స్నానం చేస్తూండవచ్చు. చెరువులోకి అప్పుడప్పుడూ మొసలి వస్తుంది. దాన్ని చూచి పారిపోయి వుంటారు."

"మొసలా? ఎక్కడినుండి వస్తూంటుంది?"

"అవతలి ప్రక్క పొదలలో విశ్రాంతి తీసుకుని మనుషులు చెరువులోకి దిగగానే అదీ దిగుతుంది."

"ఈ బట్టలు ఒడ్డున వదలి పెట్టిన వ్యక్తిని మొసలి ఎదుర్కొన్నదేమో... చెరువులో అలాంటి గుర్తులు కనిపించాయా?"

"లేదు. మొసలి యింతవరకూ ఎవరినీ పట్టుకోలేదు. అది చెరువులోకి దిగేటప్పుడు పెద్ద చప్పుడు చేస్తుంది. ఈ బట్టలు విడిచి పెట్టిన వ్యక్తి పారిపోయి వుంటాడు."

కాళి అతడిని భుజాలు పట్టి లేపింది. అతడిని నడిపించుకుంటూ అడవిలోకి దారి తీసింది. ఇద్దరూ దుర్గమమైన దారిలో ప్రవేశించారు. ఒక గుహముందు ఆగారు.

"నన్ను యిష్ట పడుతున్నావా?" అడిగింది కాళి.

"ఇంత దూరం తీసుకువచ్చి యిక్కడ మరల అడుగుతున్నావా?"

"అవును."

కుమార్ ఆశ్చర్యంగా చూశాడు." ఇష్ట పడక పోతే యీ గుహలో నన్ను బంధించి పారిపోవు కదా!"

"ఈ ప్రాంతంలో నీ యిష్టం లేకుండా ఏమీ జరగదు."

"అంటె?"

"నీ చేత వలపించుకోవడం నాకు ఏమంత కష్టం కాదు."

'కుమార్‌కు ఆమెను ఎలా అర్థం చేసుకోవాలో తెలియ లేదు.

"గుహలో ఏముంది?" అడిగాడు కుమార్.

"ఈ అడవిని కాపాడే దేవత."

కుమార్‌కి వెన్నులోంచి చలిపుట్టుకు వచ్చింది. అడవులలో దేవతలకు బలులిస్తార కాళి తనను బలి యివ్వడానికి యిక్కడకు తీసుకు రాలేదు కదా!

అంతలోనే కుమార్‌కి ధైర్యం కలిగింది. తాను యిష్ట పడక పోతే యీ అడవిలో ఏమీ జరుగదట. తనకు తానై ఎందుకు ప్రాణాలు యివ్వడానికి సిద్ధ పడతాడు?

ప్రభాకర్‌ను తాను చెరువు ప్రాంతంలో వెతకాలి. అతడిని మొసలి పొట్టన పెట్టుకోలేదు కదా!

"లోపలికి వెళ్దామా?" అంది కాళి.

కుమార్ సంశయంగా చూచి, "ఎందుకు?" అన్నాడు.

"పోనివ్వు, నువు యిక్కడే వుండు. నేను ఒకసారి దేవతను చూచి వస్తాను." కాళి గుహలోకి నడిచింది.

కుమార్ చెట్లల మధ్య వేచి వున్నాడు. కాళి గుహను చిమ్మినట్టుంది. వెదురు కట్టతో ఎండిపోయిన ఆకులూ. పువ్వులూ చేతితో ఎత్తి పట్టి చెట్ల మధ్య గుట్టగా పోసింది. కాళి మరల లోపలికి నడిచింది. కుమార్ అటూ యిటూ నడుస్తూ ఎండి పోయిన ఆకులూ పువ్వులూ కాలితో గెలికాడు. కాళి వస్తోన్న చప్పుడయింది. ఏమీ ఎరగనట్టు నిలబడి పోయాడు.

ఎండిన ఆకులూ. పువ్వులూ కుంకుమ ద్రవం అద్దినట్టు ఎర్రగా అయ్యాయి. కాళి తుక్కుపోసి గుహలోపలికి వెళ్లింది. కుమార్ చటుక్కున ఎరుపు అద్దినట్టున్న పువ్వులు నాలుగు ఏరి జేబులో వేసు కున్నాడు.తిరిగి పచార్లు ప్రారంభించాడు. తన జేబులో వున్న పువ్వులు రక్తంతో తడిశాయి. అంతవరకూ నిజం. జంతువులను బలి యిచ్చి వుంటారు.

కుమార్ పచార్లు చేస్తూ ఆగాడు. పొదలప్రక్క ఏదో వస్తువు పడివుంది. కుమార్ వస్తువును అంది పుచ్చు కున్నాడు. వాచీ అది. చెయిన్ తెగిపడివుంది. చెయిన్ మీద ఎర్రటి మరకల మీద మట్టి అంటుకుని వుంది.

వాచీ ఏతయారీయో చూశాడు కుమార్. అతడి కళ్ళ ముందు చీకట్లు కదిలాయి. అది రికో వాచీ, సాక్షాత్తూ తన అన్నయ్యది. కుమార్‌కి ఒళ్ళు జలదరించింది. తన అన్నయ్య వాచీ యిక్కడికి ఎలా వచ్చింది? కాళి వద్ద తన అన్నయ్యకు సంబంధించిన రహస్యంవుంది.

తిరుగు ప్రయాణంలో కాళి డబ్బాలాగా వాగింది. కుమార్ ముక్తసరిగా జవాబులు చెప్పాడు. వాళ్ళిద్దరినీ ఒక ఆకారం వెంబడిస్తోంది. ఆ సంగతి యిద్దరికీ తెలియదు.

## 4

గూడెంలో డప్పులు మ్రోగుతోన్నాయి. కుమార్ మంచం మీదనే పండుకున్నాడు.

"డప్పులు మ్రోగే చోటికి రావా?" అడిగింది కాళి.

కుమార్ రాలేనన్నాడు. కాళి వెళ్లి పోయింది. కుమార్ మంచం దిగి తలుపు గడియ పెట్టాడు. గుడిసె వెతక సాగాడు. గుడిసెలో మొత్తం మూడు గదులున్నాయి. చివరి గదికి బలమైన తలుపు వుంది. గడియ తీసి తలుపు తెరిచాడు. కిర్రుమంటూ తలుపు తెరచుకుంది. గదిలో కొయ్యబొమ్మలున్నాయి. వాటికి కుంకుమ బొట్లు పెట్టి రోజూ పూజ చేస్తోంది కాళి. బొమ్మల వద్ద తాజాగా దోనెలో అమర్చిన మాంస ఖండాలున్నాయి.

గదిలో తిరుగ దున్నాడు కుమార్. అతడికి ఆ గదిలో తిరుగుతూన్నంత సేపూ మతి పోతోంది. మాంస ఖండాలూ వాటి ప్రక్కగా వున్న ఎముకల పోగులూ అతడికి కడుపులో దేవుతోన్నాయి. గోడలో అమర్చిన అలమర ముందు ఆగాడు. అలమరకు అడ్డుగా వెదురు చువ్వల తడికె వ్రేలాడదీసి వుంది.

కుమార్ చేత్తో తడికెను ప్రక్కకు తప్పించాడు. అలమరలోకి చూస్తూ నిర్ఘాంత పోయాడు. అలమారలో రెండు పుర్రెలున్నాయి. వాటిలో ఒకటి పాతబడుతోంది. రెండవది యింకా కొత్తగా వుంది. పుర్రె ఎముక తెల్లగా కనిపిస్తోంది. శిరస్సును ఈ మధ్య కాలంలో మాంసం తొలిచి పుర్రెను చేసినట్టు యింకా జిగటుగా వుంది ఎముక.

కుమార్ కొంత సేపటికి తనను తాను స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఆటవికుల ఆచారాలు వింతగా వుంటాయి. వాళ్ళు తాము బలి యిచ్చిన వ్యక్తి పుర్రెను దాచుకుని ఆరాధిస్తారు. ఇంతకూ యీ వ్యక్తులు ఎవరో? వీటిలో ఒకటి కొంపతీసి...

కుమార్ వణికి పోయాడు.

తన అన్న వాచీ గుహ వద్ద దొరికింది. అతడి దుస్తులు కాళి వద్ద వున్నాయి. అతడి పుర్రె యిదే ఎందుకు కాకూడదు? అన్నయ్యను కాళి బలి యిచ్చిందా? అన్నయ్య యిష్టపడ్డాడా? ఇష్టపడకుండా ఏ వ్యక్తినీ బలవంతంగా ఏమీ చెయనన్నట్టుగా మాట్లాడింది కాళి. పువ్వుల మీద ఎరుపు రక్తం వల్ల ఏర్పడిందే. పుర్రెను చేతిలోకి తీసుకున్నాడు కుమార్. అతడిలో దుఃఖం పెల్లుబుకుతోంది. పుర్రె జారి పోబోయింది. కుమార్ పుర్రెను అటూ యిటూ త్రిప్పి చూశాడు. ఈ పుర్రె తన అన్నదో కాదో ఎలా తెలుస్తుంది?

డప్పుల వాద్యం గుడిసెను సమీపిస్తోంది. కుమార్ వప్పున పుర్రెనూ తడికెనూ యథాప్రకారంగా సర్ది తలుపు మూసి తన గదిలోకి వచ్చాడు. శయ్య మీద యిలా పండు కున్నాడో లేదో అలా కాళి గదిలోకి ప్రవేశించింది.

వస్తోనే అతడిని కౌగలించుకుంది. "రోజులు వృథాగా గడచి పోతున్నాయి. నా ప్రాణాలు నీ కోసం కొట్టుకుంటున్నాయి. అలాగే నువ్వూ నీ ప్రాణాలు నా కోసం కొట్టుకుంటున్నట్టుగా చెప్పాలి." అంది. కుమార్‌కి నిగ్రహించుకోవడం కష్టమైపోయింది. కాళి పరిపూర్ణమైన ఒంపు సొంపులున్న ఆడది. ఆమె సోయగం కుమార్ వూపిరి సలప నివ్వడం లేదు.

"ఇదేం కోరిక? నువు వలచావు. బాగుంది. వల పెంచుకోవడం అన్నది కాలం గడిచే కొద్దీ సాధ్యమవు తుంది" అన్నాడు కుమార్.

కాళి మొరాయిస్తోంది. కుమార్‌కి తన్మయంగా వుంది. ఆమె తన దంతాలతో అతడి చెక్కిలి కొరికింది. కుమార్ అది పులకరింతో వెగటో అర్థం కాని పరిస్థితిగా వుంది. కాళి తన్మయంగా అతడి ఆ బుగ్గా యీ బుగ్గా కొరుకుతోంది.

ఆమె దంతాల్లో ఒకటి నల్లగా వుంది. అది పుచ్చిపోయింది. కుమార్ దాన్ని చూస్తూనే షాక్ తిన్నట్ట యాడు. పుర్రె తన అన్నదో కాదో తను పోల్చు కోగలడు. అరె! యీ పద్ధతి యిందాకనే ఎందుకు తోచలేదు తనకు?

"బయల్దేరు. గుహకు వెళ్దాం." అంది కాళి.

"ఎందుకు?"

---

పతివాడ సుధాకర్ స్మారక బహుమతి క్రింద రు. 100 గెలుపొందిన కవిత

### తీపిబాధ

ద్వారానికి ఒయ్యారంగా
ఆనుకొని నిలబడి
మునిపంటితో
పెదవి నొక్కిపట్టి
కాలిబొటన వేలుతో
నేలను రాస్తున్నావుగాని
బొటన వేలు తీసిచూడు
నేలకు నీ వేలికి మధ్య
నలుగుతున్న నా హృదయం
మూలుగుతోంది

—శిఖామణి

మానవ సంబంధాలన్నీ ఆర్థిక కారణాల వలన ఏర్పడినవేనని అలనాడు మార్క్స్ ఈనాడు విశాఖ రచయిత వివినమూర్తి విశ్లేషిస్తూ వివరించిన చంచలనాత్మక సీరియల్

'వ్యాపారబంధాలు'

త్వరలోనే ప్రారంభం!

## పతివాడ సుధాకర్ స్మారక బహుమతులు

ఏటేటా ప్రకటిస్తున్న పతివాడ సుధాకర్ స్మారక బహుమతులు ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో 25 జూన్ 1984 నుంచి 25 జూన్ 1985 మధ్య కాలంలో అచ్చయిన ఉత్తమమైన ఒక నవల, మూడు కవితలకు యీ క్రింది విధంగా బహుమతులు యివ్వాలని నిర్ణయించాము.

**సీరియల్ నవల – బహుమతి రు.700 సిటీ బ్యూటిఫుల్ – డాక్టర్ కేశవరెడ్డి**

**కవితలు:**

1. మొదటి బహుమతి రు.200 తల్లి – కాశీనాథ & కాశీనాథ సంచిక 5-10-84
2. రెండవ బహుమతి రు.100 తీపిబాధ – శిఖామణి సంచిక 28-9-84
3. మూడవ బహుమతి రు.50 గాయాల గ్రంథాలయం – మైత్రేయ 28-9-84

హైదరాబాదు: —పతివాడ సూర్యనారాయణ,

"నా ప్రాణాలు నీ చేతిలోనూ నీ ప్రాణాలు నా చేతిలోనూ పెట్టుకోవడానికి."

కుమార్‌కి అర్థమయింది. వలపు పేరిట తన ప్రాణాలు ఆమె కోసం కొట్టుకు పోతోన్నట్టు చెప్పాలి. తన ప్రాణాలు ఆమె చేతిలో పెట్టినట్టు మైకంలో ఒప్పుకోవాలి. అంతే! ఆమె దేవికి తన ప్రియుడిని బలి యిచ్చెయ్యడానికి సర్వహక్కులూ సమకూడతాయన్న మాట.

ఆమెను ఎలాగోలాగా వదిలించుకుని తాను పుర్రెను పరీక్షించాలి. తన అన్నదో కాదో నిర్ధారణ చేసుకోవాలి.

"నువు గుహ దగ్గర వుండు. నేను వస్తాను" అన్నాడు కుమార్.

కాళి ఆశ్చర్యంగా చూచింది. చటుక్కున అతడిని ముద్దు పెట్టుకుని బయటకు పరుగెత్తింది. కుమార్ ఆమె గుహకు వెళ్తోన్నట్టు నిర్ధారించుకుని పుర్రెలున్న గదిలోకి నడిచాడు. జిగటకారతోన్న పుర్రెను అందుకున్నాడు.

దంతాలు పరీక్షించాడు. ఎడమ ప్రక్క క్రింది వరుసలో ఆరో దంతం తడిమి చూశాడు. దంతంలో సిమెంట్ ఫిల్లింగ్ వుంది. దాని ప్రక్క ఏడో దంతం లేదు. ఆ స్థానంలో చిన్న గొయ్యి వుంది.

కుమార్ నిట్టూర్చాడు. ఇది నిశ్చయంగా తన అన్నదే. ఫిల్లింగ్ చేయించుకునేటప్పుడు తానే అతడి వెంట వున్నాడు. ఏడో దంతం రెండు సంవత్సరాల క్రితం పీకించుకున్నాడు. ఆ స్థానంలో పెరిగిన కండను కాళి తొలిచి వేసింది. తన అన్నను పొట్టన పెట్టుకున్నట్టే తననీ ఆమె పొట్టన పెట్టుకో చూస్తోంది.

పుర్రెను అలమారలో సర్దాడు. వెనక్కి తిరిగాడు. కాళి గుమ్మంలో నిలబడి వుంది. ఆమె కళ్ళలో ఆకర్షణ!

"రా! నీ కోసం! నువు ఏం చేసినా నాకు కోపం రావడం లేదు. రా! మనం కలసే గుహకు వెళ్దాం." అంది కాళి.

గుడిసెకి ఒక మూలగా కంత వుంది. కంతలోంచి రెండు కళ్ళు వాళ్ళిద్దరినీ పరిశీలిస్తోన్నాయి.

కాళి నగ్నంగా వుంది. ఆమెను గుడ్లప్పగించి చూడ సాగాడు కుమార్. స్త్రీ సౌందర్యం ఎంత సున్నితమయిందో అతడి బ్రహ్మచారి మనసుకు అంతుపడుతోంది. ఆమెను మెల్లగా సమీపించాడు. ఆమె ఒంటి నునుపులు అతడిని వివశుడిని చేస్తోన్నాయి.

కంతలోంచి చూచే కళ్ళు ఎరుపెక్కాయి. కొన్ని నిముషాల పాటు ప్రక్కకు తప్పుకున్నాయి.

కుమార్, కాళి బట్టలు కట్టుకున్నారు. గుడిసెలోంచి బయట పడ్డారు. ఇద్దరూ చెట్టాపట్టాలు కట్టుకుని అడవిలో నడవసాగారు. కంతలోంచి వాళ్లను పరిశీలించిన ఆకారం యిద్దరినీ వెంబడించసాగింది.

కాళి గుహ ముందు ఆగింది. కుమార్ ఆమెను తన్మయంగా చూడ సాగాడు. ఆమె కళ్ళు ఆకర్షణీయంగా మెరుస్తున్నాయి. కోరిక తీరేటప్పుడు మనిషి మొహంలో కనిపించే మెరుపు ఆమె కళ్ళలో తళుక్కుమంటోంది. కుమార్‌ను భుజాల మీద ఎత్తుకుంది. కుమార్ కితకితలు పెడుతోన్నట్టుగా నవ్వాడు. గుహలోకి నడిచింది కాళి.

గుహలో నిలువెత్తు విగ్రహం వుంది. విగ్రహం కళ్ళు భయంకరంగా తెరచుకుని వున్నాయి. నాలుక వికృతంగా చాచి వుంది. కుమార్‌ను చటుక్కున విగ్రహం కాళ్ళ వద్ద కుదేసింది కాళి. మెరుపులాగా విగ్రహం చేతిలోని కత్తి అందుకుంది. బలంగా కుమార్ మెడమీదకు కత్తి విసరింది.

రెండు క్షణాల ముందుగా కాళి మీదకు దూకింది ఆకారం. ఇద్దరినీ పరిశీలించుకుంటూ అంతకు ముందే ఆ ఆకారం గుహలో ప్రవేశించింది. కాళి వూపుగా కత్తి విసురుతోన్న సమయానికి ఆకారం ఆమెను వీపు మీద తన్నింది. కుమార్‌ను దాటి కాళి ముందుకు మొగ్గ వేసింది. కత్తి ఖంగుమంది. ఆ వెనుకనే డబ్బున కాళి పడింది.

మరుక్షణంలో గుహలో గుండెలు వీల్చుకునే కేక వెలువడి మారు మ్రోగింది. కుమార్ మూలుగుతూ కదిలాడు. నడుము నొప్పిగా వుంది. ఆకారం అతడిని లేపి నిలబెట్టింది.

కాళి, విగ్రహం పాదాల వద్ద గిలగిల కొట్టుకుంటోంది. కత్తి ఆమె రెండు కళ్ళ మీద పెద్ద గాయాన్ని చేసింది.

కుమార్ ఆకారాన్ని చూచి కౌగలించుకున్నాడు.

"గిరీ! నువు సమయానికి వచ్చి రక్షించకపోతే నేను కూడా మా అన్నయ్య లాగా బలి అయి పోయేవాడిని!" అన్నాడు కుమార్.

గిరి అతడిని గుహలోంచి వెలుపలికి నడిపించాడు. "మీ అన్నయ్య ఆచూకీ దొరికిందా, కుమార్?" అన్నాడు గిరి.

"దొరికింది. ఏం లాభం: అతడు మరణించాడు. నాకులాగానే యీ కాముకి చేతికి చిక్కాడు. ఈమె కళ్ళలో ఆకర్షణకు నాకులాగానే కట్టుబడ్డాడు. అయితే నాకు లాగానే, నీ చేతులలో పడి ప్రాణాలు కాపాడుకోలేక పోయాడు." కుమార్ వగర్చాడు.

కాళి యింకా గిలగిలలాడుతోంది.

"నువు యిక్కడికి ఎలా రాగలిగావు?" అడిగాడు కుమార్ తిరిగి.

"మూడు రోజుల క్రితం నువ్వూ, కాళీ యీగుహకు వచ్చారు. నీ కోసం వెతికి వెతికి వేసారి పోయాను. జలపాతాన్ని చుట్టి జీపు యీ గుహ ప్రాంతాల పెట్టాను. మీ యిద్దరూ వెళ్ళాక గుహను తణిఖీ చేశాను. ఈ గుహలో నరబలులిస్తారు. తర్వాత మిమ్మల్ని వెంటాడాను. కాళీ నరబలి యిస్తుంది. ఆటవికులు నరభక్షకులు.

నిన్ను ఎలా అయినా ఈ గుహకు ఆమె తీసుకువస్తుంది. అప్పుడే నిన్ను తప్పించవచ్చునని పించింది. నిన్ను గుడిసెలో పలకరించాలని ప్రయత్నించాను. సాధ్యపడలేదు." అన్నాడు గిరి.

అడవిలో డప్పుల వాయిద్యం వినిపిస్తోంది. దగ్గరవుతోంది.

"పద! వాళ్ళు నీ శవం కోసం ఉత్సాహంగా వస్తోన్నారు." గిరి పొదల్లోకి దూకాడు. జీపు స్టార్ట్ చేశాడు. కుమార్ జీపులోకి దూకాడు. జీపు పొదల మధ్యలోంచి కదులుతోంది.

డప్పుల వాయిద్యం గుహను సమీపిస్తోంది. జీపు అడవికి అడ్డంగా పరుగెత్తుతోంది. డప్పుల వాయిద్యం గుహ ముందు నుండి కదిలింది. జీపు వెళ్ళిన వైపు పరుగెత్త సాగారు ఆటవికులు. తూనీగలాగా జీపు వేగంగా పారిపోతోంది.

